


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం

ఆసిఫాబాద్

మంగళవారం 10 ఫిబ్రవరి 2026 పేజీలు 0




# ఓటర్ నాడి బ్రహ్మముడి



## ▸ తాజా పరిస్థితులపై ప్రధాన పార్టీల ఆరా

## ▸ తటస్థ ఓటర్లపై దృష్టి...

## ▸ పోలింగ్‌కు మిగిలింది ఒకే రోజు..

## ప్రచారం ముగిసింది ప్రధాన ఘట్టం మిగిలింది

**మంచిర్యాల,ఫిబ్రవరి09,సూర్య మేజర్ న్యూస్ :**

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలుకు ఒకే రోజు ఉన్నప్పటికీ ఓటర్ల నాడి అంతుచిక్కక ప్రధాన రాజకీయ పక్షాలు, అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగింది . ప్రస్తుత పరిస్థితులు మాత్రం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య టఫ్ ఫైట్ నడుస్తున్నట్లు కనిపిస్తోంది. పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. ప్రధాన పార్టీలు ఒకవైపు ఓటర్ల నాడిని పసిగట్టడానికి ప్రయత్నిస్తూ ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

### వలస ఓటర్లకు గాలం..

తటస్థ, వలస ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తులకు పైఎత్తు వేస్తున్నారు. పట్టణాల్లోని ఇతర వార్డులు, కాలనీలతో పాటు తదితర ప్రాంతాలకు పలు కారణాలు, బతుకుదెరువు కోసం వెళ్లిన కుటుంబాలను కలుస్తూ...ఓటింగ్ రోజు వచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రం లోని 60 డివిజన్లలో ఒక్కో డివిజన్ కు సుమారు 3 వేల ఓట్లు ఉండగా 200 నుంచి 250 మంది వరకు ఇతర ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వలస వెళ్లారన్న అంచనా ఉంది. ఓటింగ్ కు ఒక రోజు ముందే స్వంత పట్టణాలకు రప్పించే ప్రయత్నాలు అభ్యర్థులు చేస్తున్నారు.




### అంతా సిద్ధం..

గ్యారెంటీల పథకాలతో ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార కాంగ్రెస్ బరిలో నిలువగా, ప్రత్యేక రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకం అందించామని బీఆర్ఎస్...తెలంగాణలో జరిగిన ప్రతీ పనిలో కేంద్రం వాటా ఉందంటూ బీజేపీ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు, కుల సంఘాల ఓట్లు కీలకంగా మారనున్నాయి. గెలుపులో ప్రతీ ఓటు కీలకంగా మారనున్న నేపథ్యంలో పార్టీలు ఒక్కరిని కూడా వదలకుండా అర్ధరాత్రి సమయంలో ను ఓటర్లను కలుస్తున్నారు. పార్టీలకు అతీతంగా ఉన్న ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు అనుకూలంగా ఉన్న వారితో సంప్రదింపులు జరుపుతూ ఓటింగ్ శాతం పెంచుకునేలా అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి.

### రాత్రి వ్యూహాలు..ఓటరు జాబితాలతో కుస్తీ

ఎన్నికల ప్రచారం ముగియడంతో రాత్రిపూట వ్యూహాలు రచిస్తూ ఓటరు జాబితాలతో కుస్తీ పడుతున్నారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి పార్టీల నాయకులు రంగంలోకి దిగారు. రాత్రి వేళ ముఖ్య నాయకులతో కలిసి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. నిన్నటి వరకు జరిగిన ప్రచారాల తీరుపై సమీక్షించుకుంటూ ముందుకెళుతున్నారు. ఏ ఓటు ఎటువైపో అంటూ లెక్కలు వేస్తున్నారు. ఓటు తమకు పడదని తెలిస్తే చాలు అప్పటికప్పుడు ఫోన్లు చేసి దయచేసి మరిచిపోవద్దంటూ వేడుకుంటున్నారు. ఓటర్ల నాడి అర్థం కాకపోవడంతో అభ్యర్థులు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు , మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు రంగంలోకి దిగి 60 డివిజన్ పరిస్థితిపై సమీక్ష చేస్తున్నారు......

### గంప గుత్త ఓట్లపై నజర్

మున్సిపల్ కౌన్సిలర్ తరపున పార్టీలోని ముఖ్యులు పట్టణాల వారీగా పలు సామాజిక వర్గాలకు చెందిన ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ప్రధాన వ్యక్తుల వద్దకు వెళ్లి తమ పార్టీకి ఓట్లు పడేలా చూడాలంటూ విజజప్తి చేస్తున్నారు. అందివచ్చిన అవకాశాన్ని ఏ పార్టీ కూడా వదిలి పట్టడం లేదు. ముఖ్యంగా వలస ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. వలస కుటుంబాలకు వాట్సప్ కాల్‌లో టచ్‌లో ఉంటూ....ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతీ ఓటర్‌ను అభ్యర్థుల వాయిస్‌తో రికార్డు చేసిన ఫోన్ కాల్ చేస్తూ....ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు..

---

## కౌంటింగ్ కేంద్రంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ ప్రతనిధి,సూర్య మేజర్ న్యూస్ :**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం సిబ్బందికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి నీడ, కుర్చీలు, త్రాగునీరు, భోజన వసతి కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు, సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాలులో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించే సిబ్బంది ప్రశాంతంగా తమ ఓటును వినియోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, తహసిల్దార్ రియాజ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## బ్యాంకులో కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ఫ్రిబవరి 09,సూర్య మేజర్ న్యూస్**




బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మీ కేవైసీని అప్‌టు డేట్ ఉంచండి అంతరాయం లేని బ్యాంకింగ్ సేవలు పొందండి" అనే అవగాహన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవైసీ అప్‌డేట్ చేయకపోతే ఖాతాలపై పరిమితులు విధించే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఆధార్, పాన్, ప్రస్తుత చిరునామా వంటి వివరాలను నిర్ణీత వ్యవధిలో బ్యాంకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.కేవైసీ పేరుతో వచ్చే అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్‌పై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను బ్యాంకు శాఖల్లో లేదా అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే అప్‌డేట్ చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖల్లో అవగాహన పోస్టర్లు ప్రదర్శించి ఖాతాదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# తీర్థయాత్రికుల కొరకు ప్రత్యేక రైళ్ళు

**- ఐ.ఆర్.సి.టి.సి.- టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్**

**మంచిర్యాల,ఫిబ్రవరి 9, సూర్య మేజర్ న్యూస్ :**

తీర్థ యాత్రలకు వెళ్ళే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐ.ఆర్.సి.టి.సి.- టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి యం. కృష్ణమూర్తి, రైల్వే శాఖ అధికారులతో కలిసి రైల్ టూర్ ప్యాకేజెస్ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21, ఏప్రల్ 14 తేదీ లలో 2 ప్రత్యేక ప్యాకేజీలను "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్యాకేజీలో మార్చి 21వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు దివ్యదక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (SCZBG53) (తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు) ఉంటుందని. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14



వేల 700 రూపాయలు, 3 ఎ.సి. ధర 22 వేల 300 రూపాయలు, 2 ఎ.సి. ధర 28 వేల 700 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొనసాగుతుందని తెలిపారు. 2వ ప్యాకేజీలో ఏప్రల్ 14వ తేదీన ప్రారంభమై 24 వ తేదీ వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (SCZBG55): ఉజ్జయిని (మహాకాళేశ్వర్ ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గృష్ణేశ్వర్) ఉంటుందని, ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 17 వేల 600 రూపాయలు, 3 ఎ.సి. ధర 26 వేల 700 రూపాయలు, 2 ఎ.సి. ధర 34 వేల 600 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి ;నిజామాబాద్ ధర్మాబాద్; ముద్ఖేడ్ హజూర్ సాహిబ్ నాందేడ్; పూర్ణ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ భీమా, రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు సమన్వయకర్తలు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకురుస్తారని, కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సి.సి. కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని, మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం

**- స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు రూ 7,699/-- వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్**

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 09,సూర్య మేజర్ న్యూస్**

పట్టణంలోని కొత్తకొమ్మరివాడ కాలనీలో విశ్వసనీయ సమాచారం మేరకు రామిలి పోశెట్టి ఇంటి నందు ఎఫ్ ఎస్ టి బృందం మరియు ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసుల సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా, ఇతని ఇంట్లో ఎన్నికల



నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వ ఉండగా 70 క్వార్టర్ బాటిల్స్ లభ్యమైనట్టు, వాటి విలువ 7,699/- గా ఉన్నట్లు, వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్ తెలిపారు. ఎఫ్ ఎస్ టి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లా పోలీసులు నిరంతరం చెక్పోస్టో ఏర్పాటుచేసి, మఫ్టీ బృందాలతో సైతం తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నందు మద్యం బాటీలు, బహుమతులు నిలువ ఉంచినట్లయితే ఇంటి యజమానులపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు.

**బాబాసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో**

## పాఠశాల మట్టి ఆరోగ్య కార్యక్రమం

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9, సూర్య మేజర్ న్యూస్**

మండలం బాబాసాగర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల లో ప్రధాన మంత్రి శ్రీ పథకం కింద పాఠశాల మట్టి ఆరోగ్య కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మట్టిలోని పోషకాల ప్రాధాన్యత, మట్టి పరీక్షల అవసరం, వ్యవసాయంలో మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన విధానాలపై ఏవో అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణతో పాటు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏవో కార్తీశా తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో పకడ్బందీగా**

## ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి 09, సూర్య మేజర్ న్యూస్ :**

2వ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని డి.ఎ.వి. పాఠశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికలలో భాగంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి, సామాగ్రి పంపిణీ సిబ్బందికి భోజన వసతులు, ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో సి సి




కెమెరాలు, బందోబస్తు కల్పించాలని, ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సిసి కెమెరాలు, వీడియోగ్రఫీ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసిల్దార్ మధుకర్, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అలుగు పోలుసులతో దొరికిన ఇద్దరు వ్యక్తులు రిమాండ్

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 9,సూర్య మేజర్ న్యూస్:**

మండలంలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో ఆయుర్వేదిక్ మందులు అమ్మడం కోసం గ్రామాల్లో భూపాల పల్లికి చెందిన ఆరుగురు వ్యక్తులు తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించడంతో వీరిని అటవీశాఖ అధికారులు ఎలకపల్లి గ్రామంలో పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద పులిగోర్లు, పులి వెంట్రుకలు, అలుగు పోలుసులు లభించగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. వారి వద్ద లభించిన వస్తువులను తీసుకొని నాగపూర్ లోని వన్యప్రాణి రీసెర్చ్ సెంటర్ కు పంపగా, ఈనెల ఆరవ తేదీన వచ్చిన రిపోర్టు ఆధారంగా అవి అలుగు పోలుసులు అని నిర్ధారణ కాగా కొండేటి వెంకటేష్, ఇంగ్లె రాజన్న లపై అటవీ చట్టం వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సిర్పూర్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు మూఢ నమ్మకాలతో ఇలాంటి వారి మాయ మాటలకు లొంగవద్దు, అటవీ జంతువులను చంపడం తీవ్రమైన నేరం, అరుదైన అటవీ జంతువులు కనుమరుగవకుండా సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అయన తెలిపారు. అటవీ జంతువులను చంపడమే కాకుండా ఇలా అటవీ జంతువుల అవయవాల కొనుగోలు, అమ్మకాలు కూడా అటవీ చట్టం మరియు వన్య ప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరం అని అన్నారు. ఈ తనిఖీలు సెక్షన్ అధికారి జగన్మోహన్, బీట్ అధికారి సతీష్, డ్రైవర్ వాజిద్, అనిమల్ ట్రాకర్ రాజు పాల్గొన్నారు.



**సర్పంచ్ల అధ్యక్షతన జరిగిన**

## గ్రామసభలు

**- వాయిదా వేసిన కామన్ పల్లి గ్రామసభ**

**జన్నారం, ఫిబ్రవరి 09, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండలంలో గల 29 గ్రామపంచాయతీలలో వివిధ గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. 29 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరగగా కామన్ పల్లి గ్రామపంచాయతీ గ్రామసభ మాత్రం సర్పంచ్, ఉప సర్పంచ్లు లేకపోవడంతో గ్రామ కార్యదర్శి కరుణ వాయిదా వేశారు. సమస్యలు విన్నవించడానికి గ్రామ సభకు వచ్చిన ప్రజలు గంటపాటు నిరీక్షించి సర్పంచ్, ఉప సర్పంచ్ రాకపోవడంతో ఏమి చేయాలో తోచక కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఈ విషయంలో కామన్ పల్లి కార్యదర్శి కరుణను సంప్రదించగా గ్రామ సభకు సర్పంచ్, ఉప సర్పంచ్లతో పాటు మిగతా కొందరు వార్డు సభ్యులు హాజరు కాకపోవడంతో, అధ్యక్షత వహించాల్సిన వారు రాకపోవడంతో మరోసారి సభ



నిర్వహించడానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు మాత్రం ఏ సమస్యలను మినిట్స్ లో రాసుకోలేదని ఆమె తెలిపారు. అదేవిధంగా పొనకల్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఆ సమస్యలను సర్పంచ్ సుష్మ ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శి రేగుండి రాహుల్ తీర్మానంలో రాసుకున్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని 11వ వార్డు సభ్యులు ముడుగు ప్రవీణ్ కుమార్ గ్రామసభ దృష్టికి తీసుకెళ్లారు. ఆన్లైన్ ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగలేదని, మిగతా వారికి ప్రభుత్వం నుంచే జీతాలు రావడం లేదని, ఆరు నెలలకు ఒకసారి వస్తున్నాయని, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని కార్యదర్శి రాహుల్ తేల్చి చెప్పారు. వారి కుటుంబ పోషణను గుర్తించి మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ అలాగే తాను కూడా వారికి ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని తెలిపారు. కావాలని ఎవరినీ ఇబ్బంది పెట్టవలసిన అవసరం తమకు లేదని రాహుల్ తెలిపారు. ఉప సర్పంచ్ అప్పల జలపతి తో పాటు పలువురు వార్డు సభ్యులు మంచినీటి సమస్యతో పాటు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా అంచలంచలుగా పరిష్కరించడానికి కృషి చేస్తామని సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ తెలిపారు. మండలంలో ఏ గ్రామ పంచాయతీలో కనిపించని పోలీసులు పొనకల్ గ్రామపంచాయతీ గ్రామసభలో కనిపించడం పట్ల పలువురు పలు రకాలుగా చర్చించుకున్నారు. గ్రామసభ ప్రశాంతంగా జరగడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు- కలెక్టర్లు, ఎస్.పి.లు, అదనపు కలెక్టర్లు, పరిశీలకులు, మున్సిపల్ కమిషనర్లతో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ముందురోజు ఎన్నికల సామాగ్రిని కేటాయించిన ప్రకారం పంపిణీ చేపట్టి సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. పోలింగ్ రోజు పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేగా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచి బందోబస్తు చర్యలు చేపట్టాలని, కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఎన్నికల సాధారణ పరిశీలములు అలోక్ కుమార్, వ్యయ పరిశీలకులు దేవేందర్ రెడ్డి, అదనపు ఎస్.పి. చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి 3 రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా విధులు కేటాయించడం జరిగిందని, ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పోలింగ్ చిట్టిలను ఓటర్లకు పంపిణీ పూర్తి చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా నీడ, త్రాగునీరు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కొరకు పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలింగ్ నిర్వహించే సిబ్బందికి రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ నిర్వహించే సిబ్బందికి ఈ నెల 12వ తేదీన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారుఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డి. ఎస్. పి. వహిదుద్దీన్, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు గజానన్, తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విస్తృత ఉపన్యాసం కార్యక్రమం

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 09,సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ రెసిడెన్షియల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల బోథ్ఏ ఆదిలాబాద్ యందు హిందీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ఉపన్యాసం అనే




కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ నుండి శ్రీ రాథోడ్ శ్రవణ్ .సహాయ అధ్యాపకులు గారు విచ్చేసి ఛాయావాద సాహిత్యం లో శ్రీమతి మహాదేవి వర్మ గారు రచించిన వే ముస్కాతే ఫూల్ నహీ అనే కవిత పాఠ్యాంశాన్ని విస్తృతంగా ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా:వీ.శివకృష్ణ హిందీ విభాగ అధ్యక్షురాలు పి .లక్ష్మీప్రసన్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు ఉపన్యాసం అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా.యం.శివకృష్ణ ముఖ్య అతిథి కి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానించారు.

## నర్సరీ పనులు వేగవంతం చేయాలి: ఎంపీడీవో జ్యోత్స్న

**వాంకిడి, ఫిబ్రవరి 9,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బంబార గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో జ్యోత్స్న సోమవారం పరిశీలించారు. గ్రామంలోని నర్సరీలో జరుగుతున్న పనులను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 6 వేలకుపైగా మొక్కలు పెంచేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. బ్యాక్‌ఫిల్లింగ్‌ను



త్వరితగతిన పూర్తిచేసి విత్తనాలు వేసే పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మొక్కలు బాగా ఎదగడానికి అవసరమైన జీవామృతాన్ని తయారు చేసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామపంచాయతీలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, దిశా పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న వంటశాల పనులను కూడా ఆమె పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిండారే కృష్ణాజీ, పంచాయతీ కార్యదర్శి ధర్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ చారి, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**పెంచికల్ పేట్,ఫిబ్రవరి9, సూర్య మేజర్ న్యూస్:**

పెంచికల్ పేట్ మండలం ఎల్కపల్లి గ్రామ పంచాయతీలోని ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనిని కల్పించాలని సర్పంచ్ భక్తు రాంచేందర్ అన్నారు. ఈజీఎస్ సిబ్బందితో కలిసి గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఉపాధి పనులతో వలస కూలి నియంత్రణ



జరుగుతుందని, రైతులకు అవసరమయ్యే పనులు చేసుకునే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్,ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, ఉప సర్పంచ్ అనిల్, మేటి శ్రీశైలం నాయకులు ఘనపురం నగేష్, జునుగరీ మధుకర్, జునుగరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు

**మంచిర్యాల,ఫిబ్రవరి09,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత ఆదేశానుసారము సాయి కుంటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో, బీసీ హాస్టల్ ను జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పాటించడము, చేతులు పరిశుభ్రంగా ఉంచుకొవడం, వేడి ఆహార పదార్థాలు తీసుకొనడం పై అవగాహనా కలిపించారు. పరిశుభ్రమైన వాటిని తీసుకొనడం, చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కలిపించారు. అదేవిధంగా కీటక జనిత వ్యాధులు, దోమలు కుట్టడం ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటివి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.దోమలు పుట్టకుండా చూడాలన్నారు. ఎలాంటి చిన్న సమస్యలు ఉన్న ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలో లోని మంట సిబ్బందికి,పిల్లలకు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ద్వారా అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో జిసిడిఓ లావణ్య, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



## షి టీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై విద్యార్థినీలకు అవగాహన

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 9, సూర్య మేజర్ న్యూస్:**

జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.షీ టీం ఇన్‌చార్జి




ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులకు మహిళల భద్రత చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, డయల్ 100 వాడకం, సోషల్ మీడియా జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై వివరించారు. తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, వేధింపులు ఎదురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565కు సమాచారం ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ దళం ఫుల్ జోష్ తో ప్రచారం....

### - అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో ధూమ్ దాం ప్రచారం

**ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సోమవారం రోజున జోరుగా ప్రచారం నిర్వహించింది. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాపర్తి రవీందర్, 8వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మామిడి శిరీష లకు మద్దతుగా నిలిచి సందీప్ నగర్, పలు కాలనీలలో లో ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారం లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని ఒట్లర్ల తో మాట్లాడారు. తమ అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉండి మీకు అన్ని విధాలుగా మీ కోసం పనిచేసే వారికే పట్టం కట్టాలని అన్నారు. ఈసారి మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు సరస్వతి, సిర్పూర్ యు మాజీ జెడ్పిటిసి కోవ అరుణ, పార్టీ ముఖ్య నేతలు కార్యకర్తలు, పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి:ఐటిడిఎ పీఓ యువరాజ్ మార్మాట్

**కడెం, సూర్య మేజర్ న్యూస్:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాల్సిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కడెం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు.కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుడు విధంగా చేయడంపై వార్డెన్‌ను హెచ్చరించారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు వసతి గృహాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి-జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్

**మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 9,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల పట్టణ కేంద్రం లోని సాయి కుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో,బీసీ హాస్టల్ ను జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా మాస్ మీడియాఅధికారి బుక్క వెంకటేశ్వర్ సందర్శించి,అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకొవడం, వేడి ఆహార పదార్థాలు తీసుకొనడం పై అవగాహనా కలిపించారు. పరిశుభ్రమైన వాటిని తీసుకొనడం, చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కలిపించారు. అదేవిధంగా కీటక జనిత వ్యాధులు, దోమలు కుట్టడం ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటివి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.దోమలు పుట్టకుండా చూడాలన్నారు. ఎలాంటి చిన్న సమస్యలు ఉన్న ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలో లోని మంట సిబ్బందికి,పిల్లలకు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ద్వారా అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో జిసిడిఓ లావణ్య, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు



# చేసిన సేవా కార్యక్రమాలే విజయాన్ని అందిస్తాయి

## - 17వ వార్డు బారాస అభ్యర్థి సంధ్యారాణి

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 8, సూర్య మేజర్ న్యూస్.**

ప్రజలే మా బలం.. మా బలగం అని తాము చేసిన సేవా కార్యక్రమాలు, వారి దీవెనలే తమను గెలిపిస్తాయని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి 17వ వార్డ్ భారతీయ రాష్ట్ర సమితి అభ్యర్థి డా,, సంధ్యారాణి – రాజా రమేష్ స్పష్టం చేశారు. ఆదివారం వార్డు పరిధిలోని పలు కాలనీలలో భారాస, సిపిఐ



నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ గా తనను ఆదరించి గెలిపిస్తే వార్డ్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిజెపి లకు ఓటు వేస్తే క్యాతన్ పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటు పడుతుందని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధి బిఆర్ఎస్ తోనే సాధ్యమని, అందుకు నిదర్శనం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులే నేడు మున్సిపాలిటీలో దర్శనమిస్తున్నాయని వారు వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వారి పాలనలో ఉద్యోగాల ఊసే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న నిరుద్యోగ భృతి, కల్యాణ లక్ష్మికి తులం బంగారం, పింఛన్ల పెంపు జాడే లేదని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ప్రజలకు తన వంతుగా నిస్వార్థంగా సేవలు అందించేందుకు పోటీలో ఉన్నానని తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను గెలిచిన వెంటనే మొదటి ప్రాధాన్యత గా మౌలిక వసతుల కల్పన పై దృష్టి సారించి పట్టణంలోనే ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతానని స్పష్టం చేశారు. వార్డులో మౌలిక వసతుల కల్పనలో బాగంగా గెలిచిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టి వార్డును అన్ని విధాల అభి వృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలో అర్హులైన వృద్ధులు, వితంతు, దివ్యాంగులకు పెన్షన్ లు మంజూరుకు కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయడంతో పాటు ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. అంతే కాకుండా ఉన్నత చదువులు చదివిన తాను నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుకు తన వంతు సహాయ సహకారాలు అందించి ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దుతానని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిత్యం తెలుసుకుంటూ ఆపదలో ఉన్న వారికి ఎల్లవేళలా అన్ని రకాల సేవలు అందిస్తూ తనను నమ్మిన వారికి అండగా నిలుస్తానని, అవకాశమివ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని, వార్డ్ ప్రజలు తనను ఆదరించి కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు డాక్టర్ రాజా రమేష్ , రామిడి కుమార్, పొన్నం హరీష్, బారాస, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, మద్దతు దారులు, అభిమానులు, వార్డ్ ప్రజలు ప్రచారంలో పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలకు యూనిఫాంల పంపిణీ

**మామడ,సూర్య మేజర్ న్యూస్**

కొరటికల్ అంగన్వాడి సెంటర్ 2 లో ఫ్రీ స్కూల్ పిల్లలకు యూనిఫాం



గ్రామ సర్పంచ్ బడి బండి రాజేశ్వర్ ఉప సర్పంచ్ మహిపాల్ రెడ్డి గ్రామ సెక్రెటరీ రవి వారి ఆధ్వర్యంలో పిల్లలకు యూనిఫామ్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్ వనజ గ్రామ కారోబరి శ్రావణ్ పరమేష్ పిల్లలు తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# 108 గిరిజన మహిళ ప్రసవం

## - 108 సిబ్బంది పని తీరు పైన అభినందనలు



**జైనూర్ ,సూర్య మేజర్ న్యూస్ :**

సిర్పూర్ -యూ ఒక గిరిజన మహిళా అంబులెన్సు లోనే బిడ్డకు సోమవారం జన్మనిచ్చింది. సిర్పూర్ యూ శెట్టిహడాపనూర్ గ్రామపంచాయతీ శెట్టిహడాపనూర్ గ్రామానికి చెందిన గర్భవతి వెడ్మ నిర్మలకి పురిటి నొప్పులు రావడంతో ఆశ వర్కర్ వెడ్మ రానుబాయి తక్షణమే 108 అంబులెన్సు కు కాల్ చేశారు 108 సిబ్బంది తక్షణమే స్పందించి హాస్పిటల్ వెళ్ళేక్రమంలో నొప్పులు అధికంగా కావడం తో అత్యవసర సమయంలో మార్గమధ్యలో 108 అంబులెన్సులోనే ప్రసవించింది.పండంటి అడా బిడ్డకు జన్మనిచ్చినట్టు 108 ఈఎంటి ప్రశాంతకుమార్ పైలట్ రవి నాలాగంటి తిలిపారు.అనంతరం సిర్పూర్ యూ ఆసుపత్రికి తరాలంచినట్టు ఆశ వర్కార్ మీ 108 సేవలు ఎప్పటికి మరువబొమని తల్లి బిడ్డ క్షేమమే అని తెలిపారు.

# బెల్లంపల్లి ఏరియా లో డైరెక్టర్ పర్యటన

**రెబ్బెన,ఫిబ్రవరి 09, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి ఏరియా లో డైరెక్టర్ ఎం తిర్మల్ రావు ( ఈ అండ్ ఎం) బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం విజయభాస్కర్ రెడ్డి తో కలిసి సోమవారం పర్యటించారు. ఖైరిగుర ఓసి లో ఇన్ పిట్ క్రషర్ కన్వేయర్ బెల్ట్ ను ఆయన ప్రారంభించారు. దీంతో రవాణా వేగవంతం అవుతుందని వాహనాల వినియోగం, చమురు వాడకం తగ్గనుందన్నారు.ఖైరిగూర ఓసి ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఖైరిగుర పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ ఓ టు జి ఎం కె రాజమల్లు, గోలేటి ఓసి పిఓ ఉమాకాంత్,ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జే శంకర్ పకార్యదర్శిర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




### ఎంజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్ ల పంపిణీ

**తిర్యాని ,సూర్య మేజర్ న్యూస్**

సీఎం కప్పులో బాగా అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మండలానికి చెందిన క్రీడాకారులకు ఎంజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్ లను పంపించేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ ఫౌండేషన్




వ్యవస్థాపకులు మాజీ జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు మడావి గుణవంత్ మాట్లాడుతూ. క్రీడాకారులను ప్రోత్సహించడంలో తమ ఫౌండేషన్ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. తనకు క్రీడలపై ఉన్న మక్కువ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని క్రీడలు శరీరక దారుఢ్యకోసం మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని సీఎం కప్ లో భాగంగా జిల్లా స్థాయిలో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి మండల ఏఎస్ఐ నారాయణ, ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్, పి ఈ టీ లు కుర్సెంగ శ్రీనివాస్, పెందొర్ సుభాష్,ఎంజీఆర్ యువ సైన్యం అధ్యక్షులు కుడ్మేత అర్జున్ నాగరాజ్, చిక్రం జంగు, మడావి రాజేందర్, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్డి పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్న జన్నారం వాసి

**జన్నారం, ఫిబ్రవరి 09, సూర్య మేజర్ న్యూస్ :** హైదరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ లో పీహెచ్డీ పూర్తి చేసి పిహెచ్డి పట్టాతో పాటు గోల్డ్ మెడల్ ను సైతం సోమవారం జన్నారం మండలం కలమడుగు గ్రామ సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ దంపతుల కుమారుడైన బొంతల మధుకర్ అందుకున్నారు. టాటా కార్నల్ ఇన్స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ యూఎస్ఏ కర్నూల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రభు ఎల్ పింగళి, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ అల్దాస్ జానయ్య ల చేతుల మీదుగా బొంతల మధుకర్ పీహెచ్డీ పట్టాతో పాటు గోల్డ్ మెడల్ అందుకోవడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 9, సూర్య మేజర్ న్యూస్:**

మండల ఎంపీడీఓ ఆల్బర్ట్ చెడ్వాయి, బొంబాయిగూడ గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. కొలతల ప్రకారం పని చేస్తే ప్రతి రోజు రూ.307 కూలీ వస్తుందని కార్మికులకు తెలిపారు.అనంతరం కొండపల్లి, లోడపల్లి గ్రామ పంచాయతీలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో సమావేశమై పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను స్వయంగా పరిశీలించారు. త్వరగా విత్తనాలు తీసుకొని బెడ్లలో వేసి, మొలకలు పెరగడం విదంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లకు చెప్పారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, జయశ్రీ, శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.



# ఎలుగుబంటి వేషధారణతో తీరిన కోతుల బెడద

## - గ్రామ సర్పంచ్ మధు వినూత్న ఆలోచన

**మందమర్రి, ఫిబ్రవరి 8, సూర్య మేజర్ న్యూస్.**

పొన్నారం గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు గ్రామ సర్పంచ్ పొన్నం మధు వినూత్న ఆలోచన అబ్బురపరిచింది. ఎలుగుబంటి వేషధారణతో గ్రామంలో కోతుల బెడదకు దారి చూపి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. కోతుల సమస్య అధికం కావడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గ్రామస్థుల విన్నపం మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ వేల్పుల శ్రీనివాస్ తో ఎలుగుబంటి వేషధారణ ధరించడంతో గ్రామంలోని కోతులన్ని పారి పోయాయి. సర్పంచ్ ఆలోచనతో కోతుల బెడదకు విముక్తి కలిగించించిన సర్పంచ్ మధును గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

# జడ్పీఎస్ఎస్‌లో పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 9, సూర్య మేజర్ న్యూస్:**

జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెంచికల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్కపల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో జిల్లా పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాబృంద సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల ప్రమాదాలు, బాల్యవివాహాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు 1930, 100, 1098 వాటి వాడకం గురించి అవగాహన కల్పించారు.విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన సభ్యులు, యువతలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరాన్ని సూచించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, కానిస్టేబుల్ సురేశ్, కళాబృంద సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి తదితరులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.